ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 6 జూన్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 36 (గురువారం)
కనిష్టం : 30

అనాథలను చేసి.. వెళ్లిపోయారు!



నాడు కాదు.. నేడు అనాథలమయ్యాం.. మమ్మల్ని అనాథలుగా వదిలేసి ఆయన మాత్రం వెళ్లిపోయారు.. ఇక మాకు దిక్కెవరు.. అంటూ అమలాపురం శ్రీకామాక్షీ పీఠం వద్ద వందలాది మంది కన్నీటి పర్యంతమయ్యారు. కామేశ మహర్షి భౌతికకాయం వద్ద బోరున విలపించారు.. ఆయన 300 మంది అనాథలను చేరదీశారు.. వారికి విద్యాబుద్ధులు చెప్పించారు.. వారిలో చాలా మందికి వివాహాలు కూడా చేశారు.. ఆ 300 మందికి ఆయనే పెద్ద దిక్కుగా మారారు.. ఆ పెద్ద దిక్కు ఆరిపోయింది.. ఆ 300 మంది అనాథలను చేసి వెళ్లిపోవడంతో కన్నీటితో నివాళులర్పించారు.. - వార్త 6లో



కామేశ మహర్షి



కల్యాణోత్సవాల అంకురార్పణలో భాగంగా గురువారం కలశాల్లో పంచామృతాలను తీసుకువస్తున్న భక్తులు

బాలబాలాజీస్వామి పెండ్లికొడుకాయెనే

» ఘనంగా ప్రారంభమైన అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. ఇందులో భాగంగా గురువారం స్వామివారిని పెండ్లి కొడుకుని చేశారు. దీంతో తిరు కల్యాణ మహోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి 9.15 గంటలకు జరుగనుంది. 6



పేదింటి బాట!

పేదింటి కలత తీర్చేలా ప్రభుత్వం అడుగులు



నాడు 3.84 లక్షల మంది ఎంపిక..

ఉమ్మడి జిల్లాలో సొంతిళ్లు లేని 3.84 లక్షల మందిని పథకానికి ఎంపిక చేశారు. తొలివిడత కింద ఉమ్మడి జిల్లాలో 1.53 లక్షల మందిని గుర్తిం చారు.ఈ మేరకు 7,218 ఎకరాలు అవసరం కాగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమి అందు బాటులో ఉన్నట్టు గుర్తిం చారు. దీంతో 5,362 ఎకరాల ప్రైవేటు భూములను ఇళ్ల స్థలాలకు సేకరించారు.ఇందుకు ఏకంగా రూ.2,566 కోట్లు ఖర్చు చేశారు. నాడు ఒక్కో అధికార పార్టీ ఎమ్మెల్యే అప్పట్లో కోట్లలో మెక్కేశారు. ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు ముందే కొనుగోలు చేసి అవే భూములను తమ పలు కుబడితో రూ.42 లక్షల చొప్పున ప్రభుత్వానికి అంటగట్టి జేబులు నింపేసుకున్నారు. ఇలా సేకరించిన ఇళ్లస్థలాలు అసలు ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేవని అప్పట్లో లబ్ధిదారులు పెదవి విరిచినా పట్టించుకోలేదు.ఒక్క కాకినాడ జిల్లాలోనే 359 లేఅవుట్లలో 77,896 ఇళ్లు నిర్మించి తీరాల్సిందేనని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 321 లేఅవు ట్లలో 68 వేల ఇళ్లు కట్టించాలని భావించారు. లేఅవుట్లు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు అసలు కన్నెత్తి చూడలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదల ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళుతోంది. ఈనెల 12వ తేదీకి జిల్లాలో చాలా మంది పేదల సొంతింటి కల నెరవేర్చి గృహ ప్రవేశాలు చేయించాలనే మంచి ఆలోచనతో అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.సీఎం చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణ కల సాకారం చేయడానికి పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ లేఅవుట్లలో మధ్యలోనే నిలిచిపోయిన పేదల ఇళ్లకు ఆర్థిక సాయం అందించి పూర్తి చేయడం, సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు నిర్మిం చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.అందులో భాగంగా ఈనెల 12న సామూహిక ఇళ్ల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోనసీమ జిల్లా లో 6,300 ఇళ్లు, కాకినాడ జిల్లాలో 6వేల వరకు ప్రారంభించనున్నారు. కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని వెలంపాలెం లేఅవుట్, కాకినాడలోని కరప మండలం వేలంగిలో సామూహిక ఇళ్లను ప్రారంభించనున్నారు. సొంత స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను కేంద్రప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతులు ఇవ్వనున్నారు.

నాడు జగన్ ఆరంభించినా..

నవరత్నాలు- పేదలందరికి ఇళ్లు పేరుతో అప్పటి జగన్ ప్రభు త్వం 2020 డిసెంబర్ 25న పథకం ప్రారం భించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లిలోని కొమరగిరిలో అప్పటి సీఎం జగన్ ఈ పథకాన్ని ప్రారంభించారు. కాకినాడ నగరానికి చెందిన 16 వేల మంది లబ్ధిదారులకు పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలంలోని కొమరగిరిలో 250 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇక్కడ సైతం ఇళ్ల నిర్మాణం పాతిక శాతం కూడా పూర్తికాలేదు.పైగా ఇక్కడ అప్పటి సీఎం జగన్ పథకాన్ని ప్రారంభించగా, పూర్తిగా విఫలమైంది. ఇలా ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో అనేక లేఅవుట్లు ఇళ్ల నిర్మాణం జరగక దిష్టిబొమ్మల్లా మారాయి.

ఖాళీ స్థలాలపై సీఎం దృష్టి..

ప్రభుత్వం మారడంతో వీటిపై సీఎం చంద్రబాబు దృష్టిసారించారు. వేల కోట్లు వెచ్చించిన లేఅవుట్ల పరిస్థితిపై కలెక్టర్ల ద్వారా నివేదిక సిద్ధం చేయిస్తున్నారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని లే అవుట్లలో 1.70 లక్షల స్థలాలు ఖాళీగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.06 లక్షల స్థలాలు పూర్తిగా ఖాళీగా ఉన్నాయని తేల్చారు. ఇందులో కొమరగిరి, కరప, రౌతులపూడి, తుని, కోటనందూరు, ఏలేశ్వరం, తాళ్లరేవు తదితర మండలాల్లో లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించారు. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 64 వేల వరకు స్థలాలు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. ఇందులో అసలే మాత్రం పనికిరానివి ఎన్ని? శ్మశానాల పక్కన ఉన్నవి ఎన్ని అనేది తేల్చబోతున్నారు. దీని ఆధారంగా పట్టాలు రద్దు చేస్తారు.

'తూర్పు'న లెక్క ఇలా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో 10,794 పేదల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా యంత్రాంగం పని చేస్తోంది. ఈ మేరకు కలెక్టర్ పి.ప్రశాంతి టార్గెట్ నిర్ణయించి ఆయా లేఅవుట్ల వారీ ప్రత్యేకాధికారులను నియమించి పనులు పరుగులు పెట్టిస్తున్నారు.ఇప్పటి వరకూ 5957 ఇళ్లు పూర్తయ్యాయి. ఇంకా 4837 ఇళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంది.ఈ నెల 7వ తేదీకి మరో 2419 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటికి అందులో 62 పూర్తి చేశారు. ఇంకా జిల్లాలో 310 ఆర్‌సీ లెవల్, 1144 రూఫ్ లెవల్‌లో ఉన్నాయి.వాటిని ముందుగా పూర్తి చేసే ఆలోచన ఉంది. బేస్‌మెంట్ లెవల్‌లో 5714, లింటల్ లెవల్‌లో 2193 ఉన్నాయి. అవిప్పుడే పూర్తయ్యే అవకాశం లేదు. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలతో ముందుకు వెళ్లే అధికారులకు కొన్ని ఇబ్బందులతో ఒత్తిడికి గురవుతున్నారు.

» 12న సామూహిక ఇళ్ల నిర్మాణాలు?
» ప్రారంభానికి అధికారుల సన్నాహాలు
» కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
» గత ప్రభుత్వ నిర్వాకంపై నివేదిక
» 1.70 లక్షల ఇళ్ల స్థలాలు ఖాళీ
» ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
» రద్దు చేసే యోచనలో సర్కారు



కాకినాడలో ఖాళీగా వెక్కిరిస్తున్న లేఅవుట్



అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సభలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ నిషాంతి, ఎమ్మెల్యే ఆనందరావు, ఇతర ప్రముఖులు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం!

» పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలి
» జిల్లావ్యాప్తంగా 4.25 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యం : జేసీ నిషాంతి

అమలాపురం,జూన్5(ఆంధ్రజ్యోతి):ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జరిగే పరిణామాలను తెలియజేసేందుకు ప్రతీ ఏటా పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రకృతిలోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరుతున్న ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్న తరుణంలో 'ప్లాస్టిక్ కాలుష్యం అంతం' చేయడమనే అంశాన్ని 2025 సంవత్సరం ఇతివృత్తంగా తీసుకున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 4.25 లక్షల మొక్కలను పాఠశాలలు, వసతిగృహాలు, కాల్వలు, డ్రైన్ల గట్లపైనా, రహదారులకు ఇరువైపులా నాటాలని లక్ష్యంగా నిర్దేశించాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అప్పుడే కోనసీమ జిల్లా హరితశోభిత జిల్లాగా రూపాంతరం చెందుతుందన్నారు. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయడం వల్లే ప్రకృతి వైవిధ్యంలో తీవ్రమైన అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని, ప్రతీ ఒక్కరు పర్యావరణ సమతుల్యత పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతే మనల్ని కాపాడుతుందన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ బదులు సంప్రదాయ గుడ్డ సంచులు, జనపనార బ్యాగులు వంటివి వాడాలన్నారు. అనంతరం జేసీ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞచేయించారు. జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బి.రాణిసంయుక్త, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో మొక్కను నాటుతున్న జేసీ, ఎమ్మెల్యే



రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలోని గురుకుల పాఠశాలలో మొక్క నాటుతున్న మంత్రి సుభాష్, ఆర్డీవో అఖిల తదితరులు



శిక్షణ పూర్తి చేసుకున్న డీఆర్పీలకు సర్టిఫికెట్లు అందించి అభినందిస్తున్న డీఈవో సలీంబాషా

నూతన విద్యావిధానంలో మార్పులపై 9 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో తీసుకువస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్వసన్నద్ధం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డీఆర్పీల మూడు రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డీఈవో సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. జిల్లాలో 124 మంది డీఆర్పీలకు నూతన విద్యా విధానంలో మార్పులపై శిక్షణ ఇవ్వడం జరిగిందని.. వారు కొత్తపేట రామచంద్రపురం, అమలాపురం కేంద్రాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. కొత్త పరీక్షా విధానం, టీచింగ్‌టూల్స్, ఆన్సర్ బుక్స్ రెన్యూవల్ వంటి అంశాలపై ఈనెల 9, 10, 11 తేదీల్లో జిల్లాలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 64 గదుల్లో 3,200 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కోర్సు కోఆర్డినేటర్ బీర హనుమంతరావు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ పవన్‌రామ్, కె.కృష్ణసాయి, ఏఎల్ఐఎస్‌సీ కోఆర్డినేటర్ రమేష్, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బొరుసువీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎంఏకే భీమారావు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన నేతలు

ముఖ్యమంత్రి చంద్రబాబును మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను నూతన చైర్మన్‌గా నియమించినందుకు లీలాకృష్ణ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన చైర్మన్‌గా బాధ్యతతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సీఎం సూచించారు. ఆయనతోపాటు కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సీఎంతో ముచ్చటించారు. - మండపేట/ఆంధ్రజ్యోతి



భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించండి : జేసీ

అమలాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలో పరీక్షా కేంద్రాలైన అమలాపురం రూరల్ మండలం భట్లపాలెంలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఆయా కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి లైన్ డిపార్టుమెంట్ల అధికారులు, కళాశాల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ పద్ధతిలో డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఒక్కో సెషన్‌కు 160 మంది చొప్పున, బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 170 మంది చొప్పున పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని జేసీ తెలియజేశారు.

సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా..

డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున కంప్యూటర్లు, సాంకేతిక పరికరాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవన్నీ సక్రమంగా పనిచేసేలా కళాశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకంటే పదిశాతం కంప్యూటర్లను అదనంగా ఉంచాలన్నారు. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అభ్యర్థులకు తాగునీరు అందించేలా చూడడంతో పాటు పంచాయతీ అధికారులు పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైద్య సిబ్బందిని, అంబులెన్సులను పరీక్షా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులు నడపాలన్నారు. ఆయా కేంద్రాలకు సమీపంలో జిరాక్సు షాపులు మూసి ఉంచడంతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసుల అధికారులకు సూచించారు. పరీక్షలను సీసీటీవీ పర్యవేక్షణలో నిర్వహిచాలన్నారు.

ఎంఈవో స్థాయి వారిని నియమించాలి

డిపార్టుమెంటల్ అధికారిగా ఎంఈవో స్థాయి అధికారిని నియమించి హాల్‌టిక్కెట్లు, నామినల్ రోల్స్‌లో తప్పిదాలు ఉంటే సరైన గుర్తింపు కార్డుతో పరీక్షలకు అనుమతించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు సహాయకులను అనుమతిస్తామన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రత్యేకంగా టాయిలెట్లు, వాష్‌రూమ్‌లు ఏర్పాటుచేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

గంట ముందే చేరుకోవాలి..

అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి కనీసం గంట ముందే చేరుకోవాలని జేసీ సూచించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థుల సమస్యలను పరిష్కరించడానికి అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని డీవైఈవో కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ (సెల్ 9866387500)ను ఏర్పాటుచేశామన్నారు. జేసీ.. అభ్యర్థులకు ఆల్‌ది బెస్ట్ చెప్పారు.

ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు : ఎస్పీ

సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ దస్త్రంపై తొలిసంతకం చేసిన నేపథ్యంలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐలు ఉండాలని, అక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేటప్పుడు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్దకు ఆటోలు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏబీఆర్‌వీపీ ప్రసాద్, ఆర్డీవో కె.మాధవి, డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్రశిక్ష స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీపీవో డి.శాంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కామేశమహర్షి

అనాథలను చేసి.. వెళ్లిపోయారు!

- అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశమహర్షి హఠాన్మరణం
- 300మందికిపైగా అనాథలకు ఆశ్రయం కల్పించిన మహోన్నత వ్యక్తి
- అక్కున చేర్చుకుని ఆదరించడమే కాక వివాహాలు సైతం చేసిన మహర్షి
- ప్రేమతత్వం.. ఆధ్యాత్మికత.. సేవా గుణం కలగలిసిన మనీషి..
- నేడు కామాక్షీ పీఠంలో మహర్షి సిద్ధిసమాధి

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఒకరా ఇద్దరా.. వందలాదిమంది అనాథలను అక్కున చేర్చుకుని ఆదరించిన మంచి మనసున్న వ్యక్తి ఆయన.. అనాథలకు ఆశ్రయం కల్పించడంతోపాటు వివాహాది కార్యక్రమాలు సైతం నిర్వహించిన నిండైన హృదయం కలిగిన గొప్ప వ్యక్తి ఆయన.. ఎందరినో సొంతింటి వాళ్లను చేసిన ఘనత ఆయనది.. ఆయనే అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశమహర్షి. ఆయన అనారోగ్య కారణాలతో గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా అమలాపురంలో పరమపదించారు. ఈ సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం..

కామాక్షీదేవి అనుగ్రహంతో..

కామాక్షీదేవి అనుగ్రహంతో కంచి పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆశీర్వాదంతో కామేశమహర్షి అమలాపురంలో శ్రీకామాక్షీ పీఠాన్ని స్థాపించారు. పీఠాధిపతిగా అమ్మవారి సేవకు మాత్రమే పరిమితం కాకుండా మానవసేవే మాధవసేవగా ఎంచుకున్న ఆయన ప్రేమతత్వాన్ని ప్రబోధిస్తూ ముందుకు సాగారు. ఆయన సేవలకు గుర్తింపుగా మద్రాసు తెలుగు అకాడమీ ఉగాది పురస్కారంతోపాటు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఎన్నో సంస్థలు, క్లబ్‌లు అవార్డులు, రివార్డులతో ఆయన్ను సత్కరించి సేవలను కొనియాడారు. అటువంటి ఆదర్శ మహనీయుడు కామేశమహర్షి(88) గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు బ్రహ్మీభూతత్వసిద్ధిని పొందారు. అహర్నిశలు తమకోసం శ్రమించిన కామేశ మహర్షి కన్నుమూయడంతో ప్రేమమందిరం చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.ఆదర్శనీయుడైన ఆమహనీయుని జీవితంలోని పలు ఘట్టాలు ఇలా ఉన్నాయి.

ఒక్కగానొక్క కొడుకు..

అమలాపురం పట్టణానికి చెందిన బెహరా సుబ్రహ్మణ్యం-వెంకటరత్నమాంబ దంపతులకు 1938, ఏప్రిల్ 2న యర్రంరాజు జన్మించారు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో ఎంతో అల్లారు ముద్దుగా యర్రంరాజును పెంచారు. సుబ్రహ్మణ్యం ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాల్లో పనిచేయడంవల్ల చిన్నతనంలోనే పలు ప్రాంతాల్లో తిరిగారు. అనంతరం అమలాపురంలో డాక్టర్ జొన్నలగడ్డ మల్లపరాజువద్ద ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యనభ్యసించిన యర్రంరాజు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో బీఎస్సీ చదివారు. మద్రాసు కాలేజ్ ఆఫ్ఇంజనీరింగ్ టెక్నాలజీలో ఏఎంఐఈ ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేశారు. అలా ఉన్నత చదువులు పూర్తి చేశారు.

కంచి పరమాచార్య స్ఫూర్తితో..

ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసిన యర్రంరాజు కంచి పరమాచార్యశ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామిని స్ఫూర్తిగా తీసుకున్నారు. కామేశమహర్షిగా మారి చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆశీర్వాదంతో కామాక్షీదేవి అనుగ్రహంతో 1967లో అమలాపురం కూచిమంచి అగ్రహారం రోడ్డులో కామాక్షీ పీఠాన్ని ఏర్పాటు చేశారు. శ్రీకామాక్షీదేవి అనుగ్రహంతో ఎన్నో ధర్మప్రచార ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలను నిర్వహించారు. కామాక్షీ పీఠానికి తల్లిదండ్రులు తమ ఆస్తిని అందిస్తే దాతలు ముందుకు రావడంతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామిఆలయాన్ని నిర్మించారు. అక్కడకు సమీపంలోని చిందాడమడుగును వెలుగులోకి తీసుకువచ్చి గోదావరి పుష్కరాలకు అంతర్వాహినిగా తీర్చిదిద్దారు. తుని మండలం హంసవరంలో శ్రీకామాక్షీదేవి, ఆదిశంకరుల ఆలయాలను కామేశమహర్షి నిర్మించారు.

కంచితో అనుబంధం..

కామేశమహర్షికి కంచి పీఠంతో ఎనలేని అనుబంధం ఉంది. 1967లో చంద్రశేఖరేంద్రసరస్వతీస్వామిజీ అమలాపురం వచ్చినప్పుడు ఆయన్ను ప్రత్యేకంగా కలిశారు. 1972, 1996 తుఫాను సమయంలోను అమలాపురం శ్రీకామాక్షీ పీఠాన్ని జయేంద్రసరస్వతీమహాస్వామి సందర్శించారు. పేరూరులో విజయయాత్రకు వచ్చిన శ్రీవిజయేంద్రసరస్వతి స్వామిజీపీఠాన్ని సందర్శించారు. ఎన్నోసార్లు కంచి కామాక్షీ పీఠాన్ని కామేశమహర్షి సందర్శించారు.

చిన్నారులకు అన్నీ ఆయనే..

ప్రేమ మందిరంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు తల్లీతండ్రి ఆయనే. గురువు, బంధువు, స్నేహితులు ఆయనే. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల ఇంటిపేరే ప్రేమమందిరం. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు ముందుకు రావడంతో ఉచితంగానే ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియట్ కోర్సులు పూర్తి చేస్తున్నారు. మరికొందరు స్వల్ప ఫీజులతో చదువుకుంటుంటే మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు దశాబ్దాల వ్యవధిలో ప్రేమమందిరంలో ఆశ్రయం పొందిన 60మంది యువతులు, 20మంది యువకులకు అన్నీ తానై వివాహాలు జరిపించిన ఘనత కామేశమహర్షిదే. వారిలో ఎందరో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతూ జీవితంలో స్థిరపడ్డవారే. ప్రకృతి విపత్తుల సమయాల్లో శ్రీకామాక్షీ పీఠం తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. అన్నదానం, వస్త్రదానం కూడా చేశారు.

2019లో సహస్ర పూర్ణచంద్ర దర్శనం

కామేశ మహర్షికి 2019, మే 5న సహస్ర పూర్ణ చంద్రదర్శన మహోత్సవాలు వారంరోజులపాటు నిర్వహించారు. శ్రీకామాక్షీదేవి అనుగ్రహంతో కామేశమహర్షి రచించిన అనేక పుస్తకాలను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి బులుసు శివశంకరరావు ఆవిష్కరించారు.

కామాక్షీ ప్రేమమందిరం ఏర్పాటు ఇలా..

1986లో గోదావరి వరదల కారణంగా అమలాపురం మార్కెట్ ఏరియాలో ముంచెత్తిన వరదలతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనాథలుగా మారారు. దీంతో చలించిన కామేశ మహర్షి కృష్ణ, సత్యవతి, నాగమహేశ్వరి అనే బిడ్డలను తీసుకుని కామాక్షీ పీఠానికి చేరుకున్నారు. అప్పుడు గోదావరి వరదల పర్యవేక్షణకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి టి.గోపాలరావుతో కామాక్షీ ప్రేమమందిరాన్ని ప్రారంభింపజేశారు. ముగ్గురితో ప్రారంభమైన ప్రేమమందిరం ఇప్పటివరకు 300మందికిపైగా బిడ్డలకు ఆశ్రయం కల్పించింది. తల్లి పొత్తిళ్లలో కళ్లు తెరవని ఆడబిడ్డలు సైతం కామాక్షీ ప్రేమ మందిరంలోనే కళ్లు తెరిచారు. అమ్మానాన్నలను కోల్పోయి అయినవాళ్లకు దూరంగా.. అనాథలుగా మారినవారు కొందరైతే, ప్రకృతి వైపరీత్యాలు, కుటుంబ తగాదాలతో ఒంటరిగా మిగిలిన అనాథలకు ఆయన ఆశ్రయం కల్పించారు. ప్రస్తుతం ప్రేమ మందిరంలో 55మంది పిల్లలతోపాటు ఐదుగురు పెద్దలు ఉంటున్నారు.



కామేశమహర్షి సహస్రపూర్ణచంద్రోయ దర్శన మహోత్సవంలో పాదపూజ(ఫైల్)

నేడు కామాక్షీపీఠంలో దివ్యసమాధి

కామేశమహర్షి బ్రహ్మీభూతత్వ సిద్ధిని పొందడంతో భక్తుల దర్శనార్థం కామాక్షీ పీఠంలో ఉంచారు. శుక్రవారం ఉదయం 6.30గంటలకు కామేశమహర్షి దివ్యసమాది కార్యక్రమం నిర్వహించేందుకు పీఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 8న ఆదివారం బ్రహ్మీభూత దివ్య ఆరాధన మహోత్సవంతోపాటు అష్టోత్తర శతవార విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించేందుకు శిష్య బృందం ఏర్పాట్లు చేసింది.

కొంగలే.. ఎగిరెనే..!





ఓ పక్క వేసవితో జనం అల్లాడిపోతున్నారు. అలాంటిది పక్షుల పరిస్థితి ఏంటి..? కాకినాడ వలసపాకల బీచ్ రోడ్డుపక్కన ఆకలి, దాహం తీర్చుకునేందుకు వచ్చిన కొంగలు కాసేపు ఇసుక తిన్నెలపై ఎండిచేపలు తిన్నాయి.. కాసేపటికి అన్నీ కలిసి గుంపుగా.. ఒకేసారి ఎగురుతూ.. ఇలా కనిపించాయి.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మొక్కలు నాటి.. పెళ్లి పీటలు ఎక్కారు

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఆదర్శంగా నిలిచిన నూతన జంట



అల్లూరిజిల్లా కూన వరం మండలం పైడిగూడెంలో పెళ్లి వస్త్రాలతోనే మొక్కలు నాటుతున్న నవీన్, రమ్య

కూనవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో తామూ భాగస్వాములవుతామంది ఓ నూతన జంట. అల్లూరిజిల్లా కూనవరం మండలం పైడిగూడెం గ్రామానికి చెందిన నవీన్, రమ్య వివాహానికి పెద్దలు గురువారం ముహూర్తం నిర్ణయించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కావడంతో ముందుగా వారు అటవీ అధికారుల సమక్షంలో పెళ్లి వస్త్రాలతోనే మొక్కలు నాటి ఆ తర్వాత వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. డీఎఫ్‌వో బబిత, సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, కూనవరం అటవీ శాఖ అధికారి కరుణాకర్ పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామి పెండ్లికొడుకాయెనే

- ఘనంగా ప్రారంభమైన అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

మామిడికుదురు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీతీరంలోని అప్పనపల్లి బాలబాలాజీస్వామివారు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం పెండ్లి కొడుకయ్యారు. జ్యేష్ఠ శుద్ధ దశమి పర్వదినాన వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, గోవిందనామస్మరణలు, సుంగధ ద్రవ్యాల పరిమళాల మధ్య శ్రీబాలబాలాజీస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని బాలబాలాజీస్వామితో పాటు శ్రీదేవిభూదేవిలను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వారి బుగ్గన చుక్కపెట్టి నుదుటిన కల్యాణం దిద్ది పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. కల్యాణోత్సవాలకు ఏవిధమైన ఆటంకాలు తలెత్తకుండా విశ్వక్సేనారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు, భక్తులు 108 కలశలతో పంచామృతాలు, సుంగధ ద్రవ్యాలు, పసుపు కుంకుమలతో స్నపన తిరుమంజన సేవను కన్నుల పండువ గా నిర్వహించారు. పుట్ట నుంచి సేకరించిన పుట్టమన్నును తొమ్మిది పాత్రల్లో నింపి అంకురార్పణ కార్యక్రమాన్ని జరిపించి పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవాలు పంచారాత్ర ఆగమానుసారం ఆలయ ఉపముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండ శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, వారి శిష్యులు, చలమచర్ల వేణుగోపాలాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ఘనంగా చేశారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి 9.15 గంటలకు జరుగుతుందని, భక్తులు పాల్గొని కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు కోరారు.



బాలబాలాజీస్వామిని పెండ్లికుమారుడిని చేస్తున్న అర్చకులు



కలశల్లో ఏర్పాటు చేసిన అంకురాలు.. చిత్రంలో కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు

సత్యదేవుడి సన్నిధిలో సేవ చేయాలనుకుంటున్నారా?

- దేవస్థానం పీఆర్వో విభాగంలో భక్తులు నమోదు చేసుకునే అవకాశం

అన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో భక్తులకు మంచినీటి సరఫరా, అన్నప్రసాదం వడ్డన, క్యూలైన్‌ల్లో భక్తులను ముందుకు కదపడానికి తదితర సేవలు చేయడానికి ఆసక్తి కలిగినవారు దేవస్థానం పీఆర్వో విభాగంలో వారి పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని అన్నవరం దేవస్థాయం ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల సేవకు విచ్చేసిన తెలంగాణ భక్తులు మధ్యవర్తుల ద్వారా రావడం.. అనంతరం వారిని దేవస్థానంలో ఒక అధికారి దురుసుగా మాట్లాడడంతో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు సేవ చేయాలనుకునే భక్తులు తునికి చెందిన శ్రీవారిసేవ అనే సంస్థ ద్వారా విచ్చేసేవారు. ఇకపై ఆసక్తి ఉన్నవారు నేరుగా పీఆర్వో కార్యాలయం ద్వారా సేవ చేసుకునే వీలు కల్పించారు.

ఎన్‌బీఏతో సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాలకు ప్రోత్సాహం

- జేఎన్టీయూకే ఉపకులపతి ప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి సీఎస్‌ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే,జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌బీఏ గుర్తింపు ద్వారా సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాలను ప్రోత్సహించేందుకు మరింత వీలు కలుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ తెలిపారు. వర్సిటీలో నియూసీఈకే కళాశాలకు యూజీ ప్రోగ్రామ్స్‌కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిన సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన అలూమ్ని ఆడిటోరియంలో గురువారం ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అభినందనసభను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ప్రసాద్ మాట్లాడుతూ సివిల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలను ఎన్‌బీఏ బృందం గతనెలలో సందర్శించిందన్నారు. ఈ ఐదువిభాగాలకు 2025-26, 2026-27, 2027-28 విద్యాసంవత్సరాలకుగాను ఎన్‌బీఏగుర్తింపు లభించిందని,2028, జూన్ 30వరకూ ఈ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు కొనసాగుతుందని తెలిపారు. వైస్‌ప్రిన్సిపాల్స్ జీవీఎస్ఆర్ దీక్షితులు, స్వరూపారాణి విభాగాధిపతులు కోటేశ్వరరావు, వెంకటరెడ్డి, మధు, సురేఖ, కళ్యాణమనోహర్, సత్యవేణి, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ వీసీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ముంగండ విద్యార్థుల ఎంపిక

పి.గన్నవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ముంగండ గ్రామానికి చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 4న ఉమ్మడి జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం మండలంలోని ముంగండ గ్రామానికి చెందిన వి.రిషిత, ఎంపీఎస్ లక్ష్మి, పి.వర్షిణి, వి.ప్రణీత్, ఎం.జగదీష్, వీఎంవీ గోపాల్, ఎం.సుజయ్, దీప్, బ్లూ వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ పి.భార్గవి తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 9 నుంచి 11వతేదీ వరకూ రాష్ట్రస్థాయిలో అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆమె చెప్పారు.



ముంగండ హైస్కూల్‌లో తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ పి.భార్గవి

చాగంటికి కలిసిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని పూర్తిగా కోలుకున్న రాష్ట్రప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతేడాది విద్యార్థుల నీతి, విలువల ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా చాగంటి నియమితులయ్యారు.




చాగంటికి పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎంపీ సతీష్‌బాబు

ఉపాధ్యాయుడిగా మారిన అనపర్తి ఎమ్మెల్యే

- పర్యావరణంపై విద్యార్థులకు బోధించిన రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 5(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉపాధ్యాయుడిగా మారారు. బ్లాక్‌బోర్డుపై పాఠాలు చెప్తూ టీచర్ అవతారం ఎత్తారు. గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యార్థులు ముందంజలో ఉండాలని వారికి బోధించారు. మండల కేంద్రమైన పెదపూడిలోని శ్రీ విజ్ఞాన్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యావరణం.. దాని ఆవశ్యకతపై కాసేపు పాఠం బోధించారు. తరగతి గదితోకి వెళ్లగానే ఆయన టీచర్‌గా మారిపోయారు. విద్యార్థులతో ఎమ్మెల్యేగా కాకుండా ఒక పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్లాస్టిక్ నివారణ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను 20 నిమిషాలపాటు చక్కగా వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుండాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, విద్యావేత్త, సామాజికకార్యకర్త వీఎస్ఎన్ మాస్టారు, టీడీపీ నాయకులు పుట్ట గంగాధర్‌చౌదరి, అమ్మన్న చౌదరి, డీసీ ఛైర్మన్ సాన శ్రీనివాసరావు, దత్తుడు, జనసేన నాయకులు నాగు పాల్గొన్నారు.



పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కాకినాడ జిల్లాలో రేపటినుంచి ట్రాఫిక్ మళ్లింపు

- సామర్లకోట-అచ్చంపేట రోడ్డులో బ్రిడ్జి పనుల కారణంగా మార్పు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్లే రహదారిలో శుక్రవారం నుంచి ట్రాఫిక్ మళ్లించనున్నారు. ఇక్కడ భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న రోడ్డులో బ్రిడ్జిలకు గడ్డర్లు లేవుతున్నందున ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ కోసం సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్ మళ్లింపు ఈనెల 7 నుంచి 10 వరకు నిలుపుదల చేస్తున్నామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అచ్చంపేట జంక్షన్‌లో కూడా రోడ్డుపై గడ్డర్‌లు లేవుతున్నందున ఈనెల 11 నుంచి 13 వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాల్లో తమ వాహనాలను మళ్లించాలని సూచించారు.

మరిడమ్మ జాతరకు పందిరిరాట ముహూర్తం

పెద్దాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఆషాఢమాసంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా సాగేందుకు పూజలు జరిపి అష్టదిక్పాలకులను ఆహ్వానించా మని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, వేద పండితులు, అర్చకులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



మరిడమ్మ ఆలయ ఆవరణలో పందిరిరాట వేస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వాహనం ఢీకొని
యువకుడి దుర్మరణం


రోడ్డుపై పడి ఉన్న గంగయ్య మృతదేహం

ఎటపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం శివారు జాతీయరహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... లక్ష్మీపురం పంచాయతీ పాలమడుగు సమీపంలోని ఎర్రకాలువవలసకి చెందిన మడివి గంగయ్య (30) ద్విచక్ర వాహనంపై చత్తీస్‌గఢ్‌లోని అత్తగారి ఊరైన సుక్మా వెళ్తున్నాడు. ఈలోగా లక్ష్మీపురం మలుపు వద్దకు రాగానే చింతూరు వైపు నుంచి భద్రాచలం వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో గంగయ్య తల పగిలి, మెదడు బయటకు వచ్చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఢీకొట్టిన వాహన చోదకుడు ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారాలతో తమిళనాడుకు చెందిన ఐషర్ వ్యాన్‌గా గుర్తించారు. వ్యాన్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు.

చెట్టు కొమ్మ విరిగిపడి చిన్నారి మృతి

● మరో చిన్నారికి గాయాలు


చిన్నారి అక్షర (ఫైల్)

ధవళేశ్వరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు కావడంతో ఆ చుట్టుపక్కల చిన్నారులంతా చేరి చెట్టునీడన ఆటలాడుకుంటున్నారు. ఆ చెట్టే ఓ చిన్నారి పాలిట మృత్యువు అవుతుందని ఎవరూ ఊహించలేకపోయారు. గురువారం ఉదయం పది గంటల సమయంలో ధవళేశ్వరంలోని స్థానిక బస్టాండ్ వెనుక వీధిలో ఉన్న రావిశెట్టి నీడలో పాతూరి అక్షర (9), దావదాసి లిషితతో పాటు మరికొందరు పిల్లలు ఆటలాడుకుంటున్నారు. అదే సమయంలో రావిచెట్టు నుంచి భారీ కొమ్మ ఒక్కసారిగా విరిగిపడి... పక్కనే ఉన్న కరెంట్ స్తంభంపై పడి, ఆపై చిన్నారులు అక్షర, లిషితపై పడడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీన్ని చూసిన స్థానికులు, బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో అక్షర మృతి చెందగా, లిషిత ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి మృతితో కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న తండ్రి త్రిమూర్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. దీంతో ఆ పేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఆ చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి విరిగిపోయిన కరెంట్ స్తంభం, తెగిపోయిన వైర్లను తొలగించారు. అయితే ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ గణేష్ తెలిపారు.

తప్పిన పెద్ద ప్రమాదం

● అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు


ప్రమాదానికి గురైన బస్సు

మోతుగూడెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గురువారం భద్రాచలం నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే ఆ సమయానికి అక్కడ విద్యుత్ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. అయితే ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో 11 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. చిన్న చిన్న గాయాలవ్వడంతో డొంకరాయి ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కర్ ప్రయాణికులు ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుని సీలేరుకు చెందిన డీఏవీ స్కూల్ బస్సులో దింపాలని ఆదేశించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రోత్సాహమేదీ..?

● ఉమ్మడి జిల్లాలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణం .. పెరుగుతున్న ధరలు
● వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారడమే ప్రధాన కారణం
● గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీలు నిలిపివేత
● కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తారని కొండంత ఆశతో రైతన్న


పొట్లపొదుల తోటలో ఓ రైతు



సామర్లకోట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఊహించని రీతిలో తగ్గుతూ వస్తోంది. దీనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు కాగా, గ్రామాల్లో సైతం వ్యవసాయ భూములు రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుతుండడమే దీనికి ప్రధాన కారణం. కాగా రాష్ట్రప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా కూరగాయల తోటల పెంపకాలకు అందిస్తున్న రాయితీలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేయడంతో కూరగాయల తోటల పెంపకందారులు ఇటీవల వరకు నిరాసక్తత చూపారు. దీంతో కొత్త పంటలు కూడా వేయాలన్న ధ్యాస వారిలో కొరవడింది. అయితే ఊహించని రీతిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కూరగాయలు పండించే రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. గతంలో వలే కూటమి ప్రభుత్వం కూరగాయల పంటలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు మండలాలలో దాదాపు 45 వేలఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో 25వేల ఎకరాలకు పడిపోయిందని ఉద్యానవన శాఖ అధికారుల గణాంక సమాచారంగా తెలుస్తోంది. పట్టణాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో స్థానికంగా సాగవుతున్న కూరగాయలు ప్రజల అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు అయ్యే దానిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ కారణంగా కూరగాయల ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అధిక మండలాల్లో కూరగాయల సాగు ఆశాజనకంగా ఉండేది. ఉమ్మడి తూర్పుజిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి సైతం బీన్స్, వంగ, మునగ, చిక్కుడు వంటి ప్రత్యేక పంటలు ఆయా ప్రధాన మార్కెట్లు, వారపుసంతలు, రైతుబజార్లకు విరివిగా వచ్చేవి. రోజుకు 60 నుంచి 70 మెట్రిక్ టన్నుల వరకూ కూరగాయలు మార్కెట్లకు చేరేవి. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, పెద్దాపురం, ఏలేశ్వరం, రాజానగరం, రావులపాలెం, తుని, ప్రత్తిపాడు తదితర ప్రధాన ప్రాంతాల ప్రజలకు నిత్యం కూరగాయలు అందుబాటులో ఉండేవి. అయితే నేడు జిల్లా ప్రజల అవసరాలలో కేవలం 40 శాతం కూరగాయల మాత్రమే స్థానికంగా పండుతున్నాయి. మిగిలిన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. బెంగళూరు నుంచి క్యారెట్, బీట్ రూట్, క్యాప్సికమ్, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వంగ, బెండ, కంద, చేమ, కాలీఫ్లవర్, క్యాబేజీ, తదితర కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు.

● ప్రభుత్వ ప్రోత్సాహం శూన్యం

జిల్లాలో కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు గత వైసీపీ ప్రభుత్వం రాయితీలు, సలహాలు, సూచనలను అందించలేదు. విత్తనాల కోసం హెక్టార్ విస్తీర్ణానికి రూ. మూడు వేలు చొప్పున గతంలో టీడీపీ ప్రభుత్వం సబ్సిడీగా చెల్లించేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఇవేమీ చెల్లించలేదు. గత ఐదేళ్ల పాలనలో ఈ పంటలు పర్యవేక్షించే ఉద్యానవన శాఖ ద్వారా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కూరగాయల పంటలపై చీడపీడలు, పురుగులు, తెగుళ్లు ఆశించినపుడు మందుల పిచికారీ చేసే స్ప్రేయర్లపై రూ. 28 వేల వరకూ ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. బిందు, తుంపర సేద్య పరికరాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో కూరగాయల రైతులకు 50 నుంచి 100 శాతం వరకూ రాయితీలు అందేవి. తీగ జాతి కూరగాయల పంటలు సాగు చేసే రైతులు పందిళ్లు వేసుకునేందుకు రూ. లక్ష వరకు ప్రభుత్వ సబ్సిడీగా వచ్చేది. ఇవన్నింటినీ వైసీపీ పాలనలో పూర్తిగా నిలిపివేశారు. ఈ దశలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో కూరగాయల సాగు కాలక్రమేణా తగ్గిపోయింది. గత టీడీపీ పాలనలో అందించిన ప్రోత్సాహకాలు తిరిగి ఇప్పుడు మళ్లీ పునరుద్ధరిస్తారని వేయి కళ్లతో రైతులు ఎదురుచూస్తున్నారు.

గిట్టుబాటు ధర లేదు

- సత్తి మంగాధర్, పనసపాడు, రైతు, సామర్లకోట మండలం.

కూరగాయల సాగుకు గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పంటలకు వేసే ఎరువులు, పురుగుమందుల ధరలు బాగా పెరిగిపోయాయి. తీరా అప్పులు చేసి కూరగాయల పండించిన తర్వాత గిట్టుబాటు ధరలు లభించక దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఉంది. దీంతో తెచ్చిన రుణాలకు వడ్డీల భారం పెరిగిపోతుంది. అందువల్ల పంట సాగు చేయలేకపోతున్నాం.

ప్రభుత్వమే ఆదుకోవాలి

- బత్తిన శ్రీను, రైతు, సూరంపాలెం, గండేపల్లి మండలం

కూరగాయల రైతులను ప్రభుత్వమే పూర్తిగా ఆదుకోవాలి. గతంలో ప్రభుత్వాలు సబ్సిడీలపై విత్తనాలు, ఎరువులు, స్ప్రేయర్లు, బిందు, తుంపర, తదితర సాగు పరికరాలు అందించేవి. వైసీపీ హయాంలో పూర్తిగా నిలిపివేసి రైతులను తీవ్ర ఇబ్బందుల పాల్జేశారు. ఇకనైనా ఈ ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలి.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒంటరితనం భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఏజర్ల విక్రమ్(19) తల్లి కువైట్‌లో ఉండగా..తండ్రి వైజాగ్‌లో ఉంటూ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. మంచిలిలో విక్రమ్ ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో ఉన్న మేనత్త ఇంటికి వచ్చాడు. చాలా సేపు అక్కడ గడిపాడు. అనంతరం మేనత్తతో ఒంటరితనం భరించలేకపోతున్న ట్టు చెప్పాడు. మేనత్త ఏదో సర్దిచెప్పింది. అయినా పట్టించుకోలేదు. కాసేపటికే వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశాడు. ఇది గమనించిన బంధువులు వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్‌ఐ బాలాజీ తెలిపారు.

టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభానికి సీఎం


టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు ఈ నెల 10 లేదా 11 తేదీల్లో ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బొమ్మూరులోని ఆర్‌టీఐహెచ్ భవనంలోని టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, ఇన్నోవేషన్ యువతలోని నైపుణ్యం కలిగిన వారి అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ప్రభుత్వం టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మన జిల్లాలో అడ్వాన్ స్కోప్‌మోడల్‌లో ఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈహబ్ నిర్వహణ విషయంలో గ్రీన్‌కోఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సంస్థలు ప్రమోటర్లుగా ఉంటాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఈ ఇన్నోవేషన్ హబ్ దోహద పడుతుందన్నారు. ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల పరిశీలన చేశామన్నారు. ఇదిలా ఉండగా కడియం మండలం వేమగిరి గతంలో మహానాడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హెలిపాడ్ ఏర్పాటుకు ఈ స్థలాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.

10 లేదా 11 తేదీల్లో చంద్రబాబు
ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ ప్రశాంతి

బట్టల వ్యాపారి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జిల్లా మండపేట రూరల్ ద్వారపూడికి చెందిన బట్టల వ్యాపారి ఎం.వీరబాబు(40) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. ద్వారపూడికి చెందిన వీరబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గురువారం రాజమహేంద్రవరం దోబీ ఘాట్ వద్ద గోదావరిలో మృతదేహం ఉన్నట్టు స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అతను ద్వారపూడికి చెందిన వీరబాబుగా గుర్తించారు. భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు

వేసవి ప్రయాణికులకు సదుపాయాలు



సామర్లకోట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రయాణికులు సొంత గ్రామాల నుంచి నగరాలకు బయలుదేరే రోజులు సమీపించినందున పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో అదనపు బోగీలను ఏర్పాటు చేసినట్టు రైల్వే సంస్థ ప్రకటించింది. సామర్లకోట రైల్వే స్టేషన్ మీదుగా అటు విజయవాడ, ఇటు విశాఖల వైపు ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పెంచి అదనపు బోగీల సమాచారాన్ని గురువారం సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందించగా ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

● 08581, 08582 నెంబర్లు గల విశాఖపట్నం-బెంగుళూరు-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక ఏసీ 3-టైర్ బోగీని జతచేసి జూన్ 29 వరకూ అందుబాటులోకి ఉంచనున్నారు.

● 08579, 08580 నెంబర్లు గల విశాఖపట్నం-చర్లపల్లి-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక ఏసీ 3-టైర్ బోగీని జతచేసి జూన్ 6నుంచి 27 వరకూ అందుబాటులో ఉంచనున్నారు.

● ఇంకా భువనేశ్వర్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం అదనపు బోగీలను ఏర్పాటు చేసినందున రిజర్వేషన్ తదితర సమాచారం కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలు తెరిచి ఉన్న సమయంలో రైల్వే సిబ్బందిని సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు.

● రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లకు తాత్కాలిక స్టాప్‌ను మరో 6 నెలలు పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించారని రైల్వే పీఆర్వో తెలిపారు. రామేశ్వరం-భువనేశ్వర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్‌లు పొడిగించిన తాత్కాలిక స్టాప్ రైళ్లల్లో ఉన్నట్టు తెలిపారు.

కాకినాడ అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స


విలేకరుల సమావేశంలో అపోలో వైద్య బృందం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన జంప మంగాయమ్మ వయసు 54. ఆమె గత నెల 25న ఫోను మాట్లాడుతూ చేపల కూరతో భోజనం చేస్తుండగా ఛాతి, ఉదర భాగంలో నొప్పి వచ్చింది. వెంటనే కాకినాడలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ జి.వంశీచైతన్య పరిశీలించి సీటీ స్కాన్ చేయించారు. అందులో సుమారు నాలుగు సెంటీ మీటర్లు పొడవు ఉన్న ఒక చేప ముల్లు గుండె పెద్ద రక్తనాళం బయట గుచ్చుకుని ఉండడం గమనించారు. వ్యాస్క్యులర్ ఎస్వీఆర్ కృష్ణ, డాక్టర్ వంశీ చైతన్య, డాక్టర్ ఎస్వీకృష్ణ పరిశీలించి సుమారు 10నుంచి 12గంటలు చేయవలసిన ఆపరేషన్‌ను అత్యంత మెళకువలు ఉపయోగించి కేవలం 3 గంటల్లోనే పూర్తి చేశారు. ముల్లును బయటకు తీశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా దేశంలోనే రెండోసారిగా నూతన విధానంతో ప్రణాళిక సిద్ధం చేసి ప్రముఖ గుండె మత్తు డాక్టర్ ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ వంశీచైతన్య, డాక్టర్ ఎస్వీఆర్ కృష్ణ సమక్షంలో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని అపోలో ఆసుపత్రి సీఈవో డాక్టర్ రాచకొండ రెడ్డప్పరెడ్డి అభినందించారు.

భారత్, అమెరికా మధ్య
వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరం

ఎంపీ హరీష్ మాధుర్


అమెరికాలో లీసామెక్లేన్‌ను కలుసుకున్న భారత ప్రతినిధి బృందం

అమలాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు వెళ్లిన ప్రతినిధి బృందం అమెరికా హైస్ రిపబ్లిక్ కాన్ఫరెన్స్ చైర్ ఉమెన్ లీసామెక్లేన్‌తో భేటీ అయ్యారు. అమెరికా హౌస్ రిపబ్లికన్ కాన్ఫరెన్సుకు కొత్తగా ఎన్నికైన చైర్ ఉమెన్, కాంగ్రెస్ ఉమెన్ లీసామెక్లేన్‌తో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి భేటీ అయ్యారు. అఖిలపక్ష విదేశీ పర్యటనలో భాగంగా ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రారంభమైన ఈ చర్చ భారత్ అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, చైనాకు వ్యతిరేకంగా సహకారం, డిజిటల్, రక్షణ, వాణిజ్య సహకారం వంటి అంశాలపై చర్చించినట్టు ఎంపీ హరీష్ తెలిపారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పాదర్శకతతో తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు, వికసిత్ భారత్ లక్ష్యంపై మెక్లేన్ ఆసక్తి చూపారని, ఆమెను భారత్ పర్యటనకు ఆహ్వానించినట్టు హరీష్ పేర్కొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తూ మునిగిపోయి నీళ్లు తాగి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో పెంటపాడు గ్రామానికి చెందిన పాలిక అభిరామ్(23) స్నేహితులను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. స్థానిక శ్రీరాం నగర్‌లో ఉన్న స్నేహితుల వద్దకు వచ్చి అక్కడి నుంచి స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి పుష్కరాల రేవుకు గురువారం సాయంత్రం వెళ్లారు. స్నానం చేస్తుండగా అభిరామ్ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన అప్పన్నను అభినందిస్తున్న జిమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన బి.అప్పన్న జాతీయస్థాయి పోలీసు పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న ఏపీ ప్రత్యేక రక్షణదళం కానిస్టేబుల్ అప్పన్న నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోలీసు సెలక్షన్ ట్రైల్స్‌లో పవర్‌లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిమ్‌లో గురువారం అప్పన్నను అల్లాడ వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, ముత్యాబత్తుల వెంకటరమణ, తిక్కా మురళీ, కట్టా బుజ్జి, వాకపల్లి దొరబాబు, పిల్లి వందన తదితరులు జిమ్‌కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన


సమావేశంలో మాట్లాడుతున్న కామన ప్రభాకర్‌రావు

కాకినాడ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు కోరారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కిసాన్ సెల్ జిల్లా సమావేశం డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకరరావు మాట్లాడుతూ తాము రైతులకు అండగా ఉంటామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు సత్యానందరావు, ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా వెంకటప్రసాద్, డీసీసీ అధికార ప్రతినిధి మారోతి శివగణేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు ప్రసంగించారు. కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కాకినాడ విచ్చేసిన ప్రభాకరరావును సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, నీరుకొండ సత్యనారాయణ, మేడిద శ్రీనివాసరావు, దవులూరి ధనకోటి, బావిశెట్టి సత్యనారాయణ, వనుం వెంకటరమణ, బత్తుల లలిత తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం

ముగిసిన లంకతల్లెమ్మ జాతర

ముమ్మిడివరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గ్రామదేవత లంకతల్లెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం దండాడింపు కార్యక్రమంతో ముగిశాయి. అమ్మవారిని ఆలయం ఎదురుగా ఉన్న రావిచెట్టుకు కట్టిన ఊయలలో ఉంచి అమ్మవారికి జోలపాట నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఆలయ ప్రవేశం చేశారు.

హరితాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలి

● పర్యావరణ దినోత్సవ ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



ముమ్మిడివరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


కామనగరువులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆనందరావు


పోతవరంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అమలాపురం రూరల్/టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): హరితాంధ్రప్రదేశ్ సాధనలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. కామనగరువులో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పలుచోట్ల మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ నక్కా అరుణకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డి.రాంబాబు, నాయకులు రాజులపూడి వెంకటేశ్వరరావు, బొంతు బాలరాజు, నక్కా చంద్రశేఖర్, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, పర్తంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. కామనగరువులోని స్నేహిత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంవద్ద మహిళలకు మొక్కలు, జ్యూట్‌బాగులను సేవాసంస్థ అధ్యక్షురాలు కుంచే స్వర్ణలత పంపిణీ చేశారు. రెడ్డిపల్లి, బండారులంక, పేరూరు పంచాయతీలో సర్పంచ్‌లు కరాటం రత్నప్రసన్న, పెనుమాల సునీత, దాసరి అరుణ, మాజీ జట్పీటీసీ చింతా శంకరమూర్తి తదితరులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. భట్లపాలెం బీవీజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ నిర్వహించి పలుచోట్ల మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు, ఏవో జక్కం వెంకటకృష్ణారావు, డాక్టర్ ఎంసీఎస్ మధన్, వైస్‌ప్రిన్సిపాల్ కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో పూలు, పండ్ల మొక్కలను నాటారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, గోకరకొండ నాగేంద్ర, వుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధరరావు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, ఇవటూరి సుబ్రహ్మణ్యం, పట్నాల రమణ తదితరులు పాల్గొన్నారు. పేరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీ, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు విద్యార్థులను ఉద్దేశించిమాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం నంద్యాల విజయకుమారి, కడలి ఆనందరామశ్రీనివాస్, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, పీఎంసీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి: ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం: ప్రతీఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు సామాజిక బాధ్యతను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం వద్ద నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోటి మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఇన్‌చార్జి కమిషనర్ పీవీ సుధాకర్, నాయకులు చెల్లి అశోక్, గుత్తుల సాయి, దాట్ల పృథ్వీరాజ్, ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, విళ్ల వీరాస్వామినాయుడు, ఎస్.శ్రీనురాజు, గోదశి పుండరీష్, అడబాల సతీష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, సీఎంఎం భాస్కరరావు, సీవో రాజేశ్వరి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఏపీవో టి.రామారావు, ఏపీఎం జి.రమణ, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో సర్పంచ్ గొలకోటి దొరబాబు, పంచాయతీ కార్యదర్శి ఇందుమతి కృష్ణవేణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. 500 మొక్కలు నాటి గ్రీన్ గ్రామంగా ఉండాలని పిలుపునిచ్చారు. యాళ్ల ఉదయ్, గొలకోటి తాతాజీ, గాలిదేవర బుల్లి, గొలకోటి రాజబాబులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం స్వగ్రామం మురమళ్ళలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, సర్పంచ్ కాలే రాజబాబు, ఏలూరి మూర్తి, ఉప్పు వాసు, విత్తనాల మూర్తి, పలివెల త్రినాధరావు, పి.రవిరాజు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

● కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ

అమలాపురంటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ వ్యవస్థలను నిర్లక్ష్యం చేయడంవల్ల ఎన్నో అనర్థాలు, అనారోగ్యాలు చోటు చేసుకుంటున్నాయని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ పేర్కొన్నారు. తరచూ వాతావరణంలో వస్తున్న మార్పులవల్ల గుండె జబ్బులు, ఆస్మా వంటి రోగాలు అధికమవుతున్నాయన్నారు. పర్యావరణ వ్యవస్థలను సురక్షితంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కోనసీమ సైన్స్ పరిషత్ 2916 మహాసభలో సర్వేశ్వరశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విచక్షణా రహితంగా కొన్ని జీవులను చంపివేయడం, చెట్లను నరికి వేయడంవల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు మంగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా పోతవరం ప్రధాన రహదారి చెంతనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. మొక్కలు నాటడంతో సరిపోదని వాటిని కాపాడుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి ప్రధాన రహదారి చెంతనే ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఎమ్మెల్యే మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్థానిక అక్విడెక్ట్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమ ప్రారంభించారు. లంకల గన్నవరం, బెల్లంపూడి గ్రామపంచాయతీలవద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్‌లు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాంలో ఏపీడీ మల్లికార్జునరావు, ఎంపీడీవో కేవీ ప్రసాద్, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నల్లా పవన్‌కుమార్ ఏపీవో లక్ష్మీనారాయణ, వాసంశెట్టి కుమార్, సంసాని పెద్దిరాజు, వడలి కొండయ్య, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, అవనిగడ్డ సత్యనారాయణ, గనిశెట్టి ఈశ్వర్, చీకురమిల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరరావు, గనిశెట్టి ఈశ్వర్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి: ఎమ్మెల్యే దేవ

అంతర్వేది: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మొక్కలు నాటారు. ఆయనతో పాటు కూటమి నాయకులు, అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన ప్రాథమిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిక్షించాలి

అయినవిల్లి: పర్యావరణాన్ని అందరూ పరిరక్షించాలని పర్యావరణ హితం కోసం మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో సరోవర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అయినవిల్లి ఎస్ఎన్‌వీఆర్ జూనియర్ కళాశాలలో సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, బయ్యా చినబాబు, డిప్యూటీ ఎంపీడీవో వాణిబెహరా, కార్యదర్శి కొంకి రామచంద్రరావు, డీసీ కాకర శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రతీఒక్కరూ పర్యావరణం పట్ల శ్రద్ధ వహించాలని మలికిపురం ఎంపీపీ ఎంవీ సత్యవాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మిల్టన్, లక్ష్మీ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రపు ఒడ్డున ప్లాస్టిక్ ఏరివేత

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం శంకరగుప్తం సముద్ర తీరంలో సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, మానవతా మూర్తుల సామాజిక సేవాసంస్థల సభ్యుల ఆధ్వర్యంలో సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. బట్టేలంక సర్పంచ్ బోనం సీతారత్నం, ఆవుపాటి శివలలిత ఆధ్వర్యంలో తీర ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బోనం రాజు, నక్కా రమేష్, జానకీరామ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గురువారం గోపవరంలో సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. హరితాంధ్ర ప్రదేశ్ నిర్మాణమే తమ కర్తవ్యమని అందరూ ప్రతిజ్ఞ చేశారు. తెలుగుదేశం మండల రైతు అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటరమణ, ఎంపీటీసీ కొంకి ఏడుకొండలు, ఆకుల శ్రీను, బెండా సతీష్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, ఉపాధి సిబ్బంది మొక్కలు నాటారు.

మొక్కలు నాటడం మన బాధ్యత

అంబాజీపేట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం మన బాధ్యతని ఎంపీపీదొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో భీమారావులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. మండలంలోని పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉపాధి హామీ ఏపీవో అడపా వెంకటకృష్ణ, ఎవో నరసింహం, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పతీ ఒక్కరూ మొక్కలు నాటాలి

రాజోలు: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ పర్యావరణ హితంగా జీవించాలని రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్ సర్పంచ్ రేవు జ్యోతి, ఉపాధిహామీ సిబ్బంది, మండల ప్రజాపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.


సఖినేటిపల్లి మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

డీఎస్సీ అభ్యర్థులకు ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌లు

అమలాపురంరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక రిక్వెస్ట్ స్టాప్‌లను ఏర్పాటుచేసినట్టు జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. భట్లపాలెం, చెయ్యేరు పరీక్షా కేంద్రాలకు సకాలంలో అభ్యర్థులు హాజరయ్యేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పేరూరు వై. జంక్షన్‌కు వెళ్లే దారిలో భట్లపాలెం జంక్షన్ వద్ద విజయదుర్గ హోంనీడ్స్ అండ్ ఫర్నీచర్ షాపు వద్ద, చెయ్యేరు శ్రీనివాసా కళాశాలవద్ద రిక్వెస్ట్ స్టాప్ బోర్డులను ప్రత్యేకంగా ఏర్పాటుచేశామన్నారు.

విద్యార్థినుల కోసం ఆటో ఏర్పాటుచేశాం

రాజోలు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కడలి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నతపాఠశాల హైస్కూలు ప్లస్ కళాశాల విద్యార్థినుల కోసం మామిడికుదురు మండలం గోగన్నమఠం నుంచి రాజోలు మండలం పొన్నమండ, ములికిపల్లి గ్రామాల మీదుగా కడలి హైస్కూలు ప్లస్ కళాశాలకు ఆటో ఏర్పాటుచేశామని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 132కేవీ రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం డబుల్ సర్క్యూట్ లైన్లకు సంబంధించి టవర్ల మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు దశల వారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. జిల్లాలో 30 టవర్లకుగాను 23 టవర్ల పని పూర్తయిందని, మిగిలిన ఏడు టవర్లను మార్పు చేయాల్సి ఉన్నందున ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు దశలవారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

యానాంలో బైక్ ర్యాలీ


యానాంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు

యానాం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు వేడుకను పురస్కరించుకుని మల్లాడి అభిమాన సంఘం, యూత్ ఆధ్వర్యంలో భారీ మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లో ఈ ర్యాలీని అభిమాన సంఘ ప్రతినిధులు ప్రారంభించారు. యానాం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాడి అభిమానసంఘ ప్రతినిధులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదరంగం పోటీల నిర్వహణ

పుదుచ్చేరిప్రభుత్వ ఢిల్లీప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజు వేడుకను పుస్కరించుకుని మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో చదరంగం పోటీలను నిర్వహించారు. స్థానిక శారద విద్యానికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో ఈపోటీను మల్లాడి అభిమానసంఘం ప్రతినిధులు పెండెం సూర్యప్రకాష్, మల్లాడి శామ్యూల్, గూటం శివగణేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించారు.

అండగా ఉంటానని భరోసా

ఐ.పోలవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తన సమస్యలను పరిష్కరించాలని కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన దివ్యాంగురాలు వాసంశెట్టి లలిత ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు మొరపెట్టుకుంది. గురువారం మురమళ్ళ పార్టీ కార్యాలయంవద్ద ఆమె బుచ్చిబాబుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. స్పందించిన ఎమ్మెల్యే అండగా ఉంటానని లలితకు హామీ ఇచ్చారు. గుత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అలసత్వం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే దేవ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని, అభివృద్ధి సంక్షేమ ఫలాలతో గ్రామాలు మెరుగుపరిచేందుకు ప్రతీఒక్కరూ కృషిచేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సఖినేటిపల్లి మండల సర్వసభ్య సమావేశానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రధానంగా ప్రతీ గ్రామంలోను కాల్వలు, రోడ్ల పక్కన చెత్తా చెదారాలు, పిచ్చి మొక్కలు ఉండరాదన్నారు. సఖినేటిపల్లి రేవు నుంచి అంతర్వేదిపాలెం ఎత్తు వంతెన వరకు ఉన్న ప్రధాన రహదారి ఇరుపక్కలా ఎటువంటి అనధికార దుకాణాలు, వాహనాలు, ట్రాక్టర్లు, సిమ్మెంటు ఇటుకలు ఉంచరాదని, వాటిని వెంటనే తొలగించాలని కార్యదర్శులను ఆదేశించారు. మండలంలో డంపింగ్ యార్డులకు స్థలాలు గుర్తించాలని తహశీల్దార్, వీఆర్వోలను ఆదేశించారు. సఖినేటిపల్లిలంకలో లేస్ బిల్డింగ్ వద్ద మహిళలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడంలో ఏపీఎం అజయ్ పనితీరుపై మండిపడ్డారు. అంతర్వేదిపాలెం ప్లస్‌టూ పాఠశాలలో అడ్మిషన్లు రాకపోవడంపై విద్యాశాఖాధికారులను ఆరాతీశారు. గోదావరి సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి పథకం ద్వారా నియోజకవర్గానికి తాగునీటి సమస్యలు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు రుచికరమైన భోజనం అందించాలి

రాజోలు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న జిల్లా ప్రజాపరిషత్ ప్రాథమిక, మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రాజోలు ఎంఈవో ఎస్.మనోహరం ఆధ్వర్యంలో రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సమగ్రశిక్ష మధ్యాహ్న భోజన అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్ పాల్గొని మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ఆదేశాల మేరకు మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కల్పించామన్నారు. పిల్లలకు పోషకాలు కలిగిన భోజనాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకులు తగిన శ్రద్ధతో అందించాలన్నారు. మెనూ ప్రకారం వంటలు చేయడమే కాకుండా వంటలు వండే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. రాజోలు ఎంఈవో-2 ఎస్కేడీ ప్రసాదరావు, రిటైర్డ్ ఎంఈవో గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వాటరు ట్యాంకులకు భూమిపూజ

అంతర్వేది, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రూ.1650 కోట్లతో సెంటల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా గొంది గ్రామంలో రెండు మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ బొబ్బర్లంక వాటర్ గ్రిడ్ నుంచి రాజోలు నియోజకవర్గానికి పైపులైన్ల ద్వారా మంచినీటి సరఫరా జరుగనుందన్నారు. ఈ ప్రాజెక్టు రూ.1650 కోట్లతో సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరా చేసేందుకు 60 వాటరుట్యాంకులను నియోజకవర్గంలో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

గణపతిరావు మృతికి సంతాపం


గణపతిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

అమలాపురంరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషిచేసిన కటకం గణపతిరావు మృతి చేనేత రంగానికి తీరనిలోటని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బండారులంక శివారు చినచంద్రపురం వద్ద గణపతిరావు చిత్రపటానికి గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, నాయకులు కొండా సత్యనారాయణరాజు, కాలెపు శ్రీనివాసరావు, కాశిన బాబి, కొండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీమంత్రి పినిపే విశ్వరూప్ ఐపతిరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

చెత్తకు నిప్పు

● మంటలలో కొబ్బరి చెట్టు దగ్ధం

పి.గన్నవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ ప్రధాన కేంద్రం పి.గన్నవరం డంపింగ్ యార్డు లేకపోవడంతో గత కొన్నిరోజులుగా ఏటిగట్టు చెంతనే డంపింగ్‌యార్డుగా మారింది. ఈ క్రమంలో గత రెండు రోజులుగా పేరుకుపోయిన చెత్తకు నిప్పుపెట్టడంతో భారీగా పొగ వ్యాపిస్తోంది. అంతేకాకుండా బుధవారం చెత్త నుంచి వచ్చిన మంటలు కారణంగా ఏటిగట్టు చెంతనే ఉన్న కొబ్బరిచెట్టుకు సైతం మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. దట్టమైన పొగ ఏర్పడటంతో స్థానిక వ్యాపరస్తులతోపాటు ప్రజానీకం తీవ్రఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రంపై ప్రత్యేక దృష్టిక నబరిచి డంపింగ్‌యార్డు చెత్తసంపద తయారీ కేంద్రాలను ఏర్పాటుచేసి చెత్త సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అఖిల్‌కు ఎమ్మెల్యే సత్కారం


అఖిల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెం దిన గంధ్రోతు అఖిల్ 45వ ర్యాంకు, ఆల్ ఇండియాలో 665 ర్యాంకు సాధించాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన అఖిల్ తండ్రి మృతిచెందడంతో చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి పనిచేసుకుని అఖిల్‌ని చదివించానని తల్లి వసంతలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ర్యాంకు సాధించిన అఖిల్‌ను గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, తల్లి వసంతలక్ష్మి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలతో మెరుగైన సేవలందించాలి: ఎమ్మెల్యే గిడ్డి


నగరం మార్కెట్ కమిటీచైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పెనుమాల లక్ష్మి

మామిడికుదురు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలవకర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, చైర్మన్‌గా పెనుమాల లక్ష్మి, వైస్‌చైర్మన్‌గా గుడాల వెంకటరమణ, సభ్యులుగా బొక్కా లలితాదేవి, బండారు శ్రీను, కుంపట్ల మల్లికార్జునరావు, లూటుకుర్తి సత్యనారాయణ, లంకే వెంకటలక్ష్మి, కండిబోటి సత్యఈశ్వరి, నిమ్మకాయల వెంకటలక్ష్మి, నూకల వెంకటేశ్వరరావు, పెంటా ఏసుకుమారి, పినిశెట్టి రామచంద్రశేఖర్, చిట్టాల రామజోగేశ్వరరావు, అడబాల నాగమణి, పితాని వెంకటేశ్వరరావు, నగరం సర్పంచ్ జాలెం రమణకుమారిలు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ జడ్పీచైర్మన్ నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, నాయకులు జాలెం శ్రీనివాసరాజా, బోనం బాబు, అడబాల తాతకాపు, చట్టుగుళ్ల కిశోర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలకు ఉత్సవ కమిటీ ఏర్పాటు


అప్పనపల్లి కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ

మామిడికుదురు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణోత్సవాలకు 15 మందితో ఉత్సవ కమిటీని ఏర్పాటుచేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కమిటీచైర్మన్‌గా 16 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించారు. కమిటీ సభ్యులు గురువారం స్వామివారిని దర్శించుకోగా వారికి ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు స్వామివారి కండువాను కప్పి అభినందనలు తెలిపారు. కమిటీ సభ్యులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు పకడ్బందీగా జరగాలని సహాయ కమిషనర్ ఆకాంక్షించారు.

చింతాలమ్మకు గరగ బహూకరణ

మామిడికుదురు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి గ్రామదేవత చింతాలమ్మవారికి అదే గ్రామానికి చెందిన తెలగారెడ్డి రాధాకృష్ణ-కృష్ణవేణి దంపతులు వెండి గరగను బహూకరించారు. ఈ వెండి గరగను రెండు పావు కిలోల వెండితో రూ.2లక్షల 50వేలతో దాతలు తయారు చేయించినట్టు తెలిపారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని గురువారం ఆలయకమిటీకి గరగను అందించారు. అమ్మవారి సన్నిధిలో వెండిగరగ సంప్రోక్షణ నిర్వహించారు. గరగ ఇచ్చిన దాతలను ఆలయ కమిటీవారు అభినందించారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ


మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు

కపిలేశ్వరపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ పరిధిలోని తాతపూడిలో గురువారం క్షయవ్యాధిపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ ఫ్రీ ఇండియాపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడారు. ఈనెల 30 వరకు ప్రతి గ్రామంలో టీబీ ముక్తభారత్ అభియాన్‌పై అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా త్వరితగతిన వ్యాధి అదుపులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్‌టీఎస్ రమణ, ఎస్‌టీఎల్‌ఎస్ బేగం, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, ఆరోగ్య కార్యకర్త దేవి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి రథానికి భక్తుల పూజలు

ఆలమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా రథానికి ఆలమూరులో గురువారం స్వాగతం లభించింది. సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సత్యసాయి రథోత్సవం నిర్వహించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సత్యసాయి రథం జొన్నాడ, ఆలమూరు, కొత్తూరు సెంటర్, గుమ్మిలేరు మీదుగా మండపేటకు వెళ్లింది. ఆలమూరులో సత్యసాయి భక్త మండలి సభ్యుడు కంచర్ల కామేశ్వరరావు అధ్వర్యంలో భక్తులు స్వాగతం పలికి పూజల అనంతరం హారతులిచ్చారు. గుమ్మిలేరులో మహిళా భక్తులు హారతులతో స్వాగతం పలికారు.

ఘనంగా సత్యసాయి రథోత్సవం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథోత్సవంలో భాగంగా గురువారం సత్యసాయి రథం రావులపాలెం చేరుకుంది. స్థానిక సత్యసాయి సేవా కేంద్రం వద్ద నుంచి సంస్థ సభ్యులు కలశాలతో పూర్ణకుంభ స్వాగతం పలికి పూజలు చేశారు. అనంతరం పలు వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


రావులపాలెంలో సత్యసాయిబాబా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

'పాఠశాలలు తెరిచేనాటికి సిద్ధంగా ఉండాలి'

కె.గంగవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరిచే సమయానికి మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని ఎంఈవో ఏ.నాగరాజు అన్నారు. గురువారం మండల వనరుల కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల సహకారంతో ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ద్రాక్షారామలో 9న జరిగే యోగా కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సుందరపల్లి ఉన్నత పాఠశాల ఎస్.వేణుగోపాల్, దంగేరు ఉన్నత పాఠశాలకు గుణ్ణం శ్రీనివాసు, పామర్రు ఉన్నత పాఠశాలకు శ్రీ ఈశ్వరుడు, కూళ్ల ఉన్నత పాఠశాలకు కె.శ్రీమన్నారాయణ, అద్దంపల్లి ఉన్నత పాఠశాలకు వై.వెంకట రమణ, కోటిపల్లి ఉన్నత పాఠశాలకు కుమార్, భట్లపాలిక ఉన్నత పాఠశాలకు చోడిశెట్టి సత్యకుమారి బదిలీలపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.


మాట్లాడుతున్న ఎంఈఓ2 ఆంజనేయులు


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.79 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్త లు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,79,230 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడకు చెం దిన చంద్ర దిలీప్‌కుమార్, జ్యోతి దంపతులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందచేశారు.

కేశవస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం

ఆత్రేయపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ర్యాలి గ్రామానికి చెందిన పేరిచెర్ల శాస్వితరాజు రూ.50,116, అనిదిత్ వర్మ రూ.10,116, భాను రిద్ధి రూ.5వేలు విరాళాలు అందచేశారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. ఏలూరుకు చెందిన సీహెచ్ ఉదయకిషన్, హేమలత దంపతులు రూ.5,116 విరాళం అందజేశారు.


ర్యాలి కేశవస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం ఇస్తున్న దృశ్యం

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మండపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలంలో రైతులకు ప్రభుత్వ వ్యవసాయశాఖ ద్వారా మంజూరైన పవర్ టిల్లర్‌లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, మాజీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, చింతపల్లి రామకృష్ణ, వ్యవసాయాధికారి యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అత్రేయపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) పురుగు మందు తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. అత్రేయపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన రేలంగి సుబ్బారావు(55) వ్యవసాయ కూలీగా పని చేస్తు జీవిస్తున్నాడు. ఇటీవల చెడు వ్యసనాలకు గురవడంతో అతడి కుమారుడు తండ్రిని మందలించాడు. దీంతో బుధవారం పురుగు మందు తాగడంతో వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించటంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాము తెలిపారు.

పోష్టికాహారాన్ని రుచికరంగా అందించాలి

ఆత్రేయపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం రుచికరంగా అందించాలని ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, వంటపాత్రలు శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు రోజువారి మెనూ అందించాలని ఎంఈవో పేర్కొన్నారు.


మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్న పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 132కేవీ రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం డబుల్ సర్క్యూట్ లైన్లకు సంబంధించి టవర్ల మరమ్మతుల్లో భాగంగా 9వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.


రాయవరం మండలం వెదురుపాకలో మొక్కను నాటుతున్న దృశ్యం


ఆలమూరులో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు


ఆత్రేయపురంలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి


రామచంద్రపురంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి సుభాష్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురం మండలం ఆదివారపుపేట జీఎంసీ బాలయోగి ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వనమహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి సుభాష్ మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో దేవరకొండ అఖిల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు హరిత దూతలుగా మారాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి ప్రసాదరావు, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ మాధురి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకులు టేకుమూడి సత్యనారాయణ, డాక్టర్ మడకా రాంబాబు, వైట్ల గజలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఆయన స్థానిక నేతలు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎన్.వీర్రెడ్డి, యరగతపు బాబ్జి, సత్తి సత్యనారాయణ,గోణం పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రితాతారావు, పిల్లా తాతీలు, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తదితరులతో పాటు కూటమి నేతలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చేతి సంచుల పంపిణీ: కేశవరంలో గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త యండ్ల రవి పలువురు ఉపాధి కూలీలకు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చేతి సంచులను పంపిణీ చేశారు.

● ప్రధానమంత్రి మోడీ పిలుపు మేరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ తన తల్లి దివంగత పెంటమ్మ జ్ఞాపకార్థం పట్టణంలో మొక్కను నాటారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భ ంగా గురువారం ఆల మూరులో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఆలమూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నాతి లావణ్య, ఏపీవో అరుణకుమారి, కూటమి నాయకులు సాలి సత్యనారాయణ, అత్తిలి సత్తిబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలువురు మొక్కలు నాటారు. మండల ప్రత్యేకాధికారి ఎంవీ రామారావు, జడ్పీటీసీ బోనం సాయిబాబా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బంగ్రరాజు, ఎంపీడీవో వెంకటరామన్, సర్పంచ్ గెడ్డం సుధ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు మొక్కలు నాటారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగవరంలో సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, కూళ్లలో సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలన్నారు. గురువారం మండలంలోని వాకతిప్పలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే ప్రసన్నకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు అల్లూరి రామకృష్ణ చౌదరి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది, పలు శాఖల అధికారులు, వీఆర్వో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవల్లి రాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ మేడిశెట్టి కోటేశ్వరరావు, ఎంఈవో వై.సూర్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పసలపూడిలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమల్లి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మావతి, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వెదురుపాకలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, టీడీపీ నాయకులు కొవ్వూరి చంటిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకురాలు కె.శ్రీదేవి, కూటమి నాయకుల ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. మాచవరంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎం.రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో వనమహోత్సవం జరిగింది. గ్రామ సర్పంచ్ కె.సీతామహాలక్ష్మి, వార్డు సభ్యులు గంటి చంద్రశేఖర్, కొవ్వూరి కృష్ణారెడ్డి, నీటి సంఘం ఉపాధ్యక్షులు రిమ్మలపూడి సత్యనారాయణ తదితరులు మొక్కలు నాటారు. వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, చొల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురక్కాళ్ళపల్లి గ్రామంలో వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో 4, 23వ వార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అల్లం శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మేజిస్ట్రేట్: రామచంద్రపురం కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ బి.నాగేశ్వరరావు నాయక్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకుడు ఉండవిల్లి గోపాలరావు, కార్యదర్శి బొడ్డు వరహా నరసింహమూర్తి, కోశాధికారి చింతపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో వనసంరక్షణ ర్యాలీ

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ, బృందావన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వనసంరక్షణ ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీని కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ జత్తుక వెంకట్రావు, సుబ్రహ్మణ్యం గుప్తా తదితరులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.


మండపేటలోని ద్వారపూడిలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

ఇంటింటికి మొక్కల పంపిణీ: పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం మండలం హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. అటవీశాఖ అందచేసిన పలు రకాల మొక్కలను ఆయా కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి కాశి రాకేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధి వాడపాలెం గ్రామసర్పంచ్ త్సామా బాబు ఆధ్వర్యంలో సుమారు 2వేల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో పి.శ్రీకర్ పాల్గొని పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే కొత్తపేట పంచాయతీ పరిధిలో సర్పంచ్ బూసి జయలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే వానపల్లి పంచాయతీ సర్పంచ్ పల్లి భీమారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామాల్లో పలు సచివాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బండారు సందీప్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ఎంపీడీవో పి.నరేష్‌కుమార్, సంపతి కనకేశ్వరరావు, బూసి భాస్కరరావు, పప్పుల కొత్తయ్య, బండారు రాజేష్, పెద్దింటి రామం, కడియం భాస్కర్, పాలాటి మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.


బూరుగుపల్లిని సన్మానిస్తున్న చాత్రాతి దంపతులు

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌కు పలువురు శుభాకాంక్షలు

రాయవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బూరుగుపల్లి శేషారావుకు కోనసీమ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రాయవరం మండలంలోని లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, సరస్వతి దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తాడేపల్లిలో జరిగిన ప్రమాణ స్వీకారంలో రాంబాబు దంపతులు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరాల రాంబాబు, ఆళ్ల రామకృష్ణ పాల్గొని ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కామేశ మహర్షి అస్తమయం తీరనిలోటు

కొత్తపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం కామాక్షి పీఠాధిపతి కామేశ మహర్షి అస్తమయం కోనసీమకు తీరనిలోటని పలివెల అల్లూరి అధ్యయన సంస్థ అధ్యక్షుడు దుళ్ళ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా సానుభూతి, సంతాపాన్ని తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

ద్రాక్షారామ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వెల్ల పీహెచ్‌సీని మలేరియా జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్న, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే పూజలు

ఆలమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల చొప్పెల్లలో పునర్నిర్మాణం జరిగిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, నాయకులు కర్రి నాగిరెడ్డి, తమ్మన శ్రీనివాస్ తదితరులను ఆలయ కమిటీ అధ్వర్యంలో సత్కరించారు.

రోహిత్ కుటుంబానికి ప్రభుత్వ సాయం అందజేత

మండపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ముమ్మిడివరం మండలం సలాదివారిపాలెంలో గోదావరిలో దిగి మండపేట పట్టణం గొల్లపుంతకు చెందిన యువకుడు కులపాక మల్లేశ్వర వీరవెంకటరోహిత్ గోదావరిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. చిన్నతనంలోనే తల్లితండ్రులను కోల్పోగా, అన్న మరణంతో ఒంటరి అయిన చెల్లెలిని అమె బంధువులు చూస్తున్నారు. దీంతో బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం రోహిత్ సోదరికి అందజేశారు. కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రుశ్రీవరప్రకాష్, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు, స్థానిక నాయకులు ఎం.సూర్యప్రకాష్, టేకి రమణ, కాశీన కాశీవిశ్వనాథం, అధికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుకు సాయం

ఆలమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల పెనికేరులో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పాడి రైతుకు పలువురు దాతలు ఆర్థికసాయం అందించారు. పెనికేరులో జరిగిన అగ్నిప్రమాదంలో రైతు గోపు శ్రీనుకు చెందిన రెండు పాడి పశువులు గాయపడటంతోపాటు పశువులశాల, గడ్డివాము దగ్ధమైన విషయం తెలిసిందే. పాడి రైతును ఆదుకోవాలనే లక్ష్యంతో పెనికేరుకు చెందిన టీడీపీ నాయకుడు ఈదర శ్రీరామచంద్రమూర్తి రూ.10వేలు అందించారు. ఆలమూరు మండల కాపు సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు రూ.10వేలు అందజేశారు. రైతుకు ఆర్థికసాయం చేసిన దాతలను పలువురు అభినందించారు.


పెనికేరులో అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుకు ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

సైఫాన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఆత్రేయపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్ వద్ద చేపడుతున్న సైఫాన్ నిర్మాణ పనులను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ముంపునకు గురువుతున్న పంట పొలాలను రక్షించేందుకు సుమారు రూ.3కోట్లతో లొల్ల వద్ద నిర్మిస్తున్న సైఫాన్ పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీ శాఖ జేఈ విజయలక్ష్మి చేపడుతున్న పనులను ఆర్డీవోకు వివరించారు. నాణ్యత ప్రమాణాలతో త్వరతగతిన పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈయన వెంట తహశీల్దారు రాజేశ్వరరావు ఉన్నారు.


లొల్ల వద్ద నిర్మిస్తున్న సైఫాన్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శలు

కె.గంగవరం, జూన్5(ఆంధ్రజ్యోతి): మండలంలోని యండగండి గ్రామంలో రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ పలు బాధిత కుటుంబాను పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు కడలి రాజు తండ్రి మసేను, కోట సత్యనారాయణ(కొండ) కుమారుడు మృతి చెందారు. వారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస రావు, నరాల ఏడుకొండలు, కట్టా సూర్య నారాయణ తదితరులు ఉన్నారు.


యండగండిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బోస్

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం



ఆత్రేయపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దివ్యకల్యాణోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఈవో ఎన్.సూర్యచక్రధరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు అభిషేకం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి క్షేత్రపాలకుడు కల్యాణం శుక్రవారం రాత్రి నిర్వహిస్తున్నట్లు ఈవో రమణమూర్తి తెలిపారు. వారం రోజులపాటు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.


పదమరఖండ్రికలో తటాక నాభిశిల యంత్ర ప్రతిష్ఠ నిర్వహించిన దృశ్యం

ఘనంగా యంత్ర ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమరఖండ్రికలో గురువారం శ్రీ తటాక (లక్ష్మీనారాయణ) నాభిశిల యంత్ర ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంకల్పం, గవ్యాంత పూజ మార్జనలు, యంత్రపూజ గర్తన్యాసం, రత్నన్యాసం, స్థాపన దివ్య నిక్షేపణం, యంత్ర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం, కళాన్యాసం, దృష్టిగోవు, స్వామివారి దర్శనం, మహాపూర్ణాహుతి, ఆచార్య పూజ, అగ్నిప్రదక్షిణం, శాంతి కల్యాణం, తదితర పూజా కార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.